నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, సోమవారం 19 ఆగస్టు 2024 | YADADRI BHUVANAGIRI

అనుబంధాల వేడుక రాఖీ

- నేడు రక్షాబంధన్

అన్నా చెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి, అనురాగానికి ప్రతీక రాఖీ. నేడు రాఖీ పౌర్ణమి సందర్భంగా పండుగను ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆడబిడ్డలు అన్నదమ్ములకు రాఖీలు కట్టి ఆశీర్వచనాలు అందిస్తారు. పండుగ సందర్భంగా మార్కెట్లలో రాఖీ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఇక స్వీట్ల దుకాణాల్లోనూ కొనుగోళ్ల సందడి కనిపించింది.

భువనగిరిలో రాఖీలు కొంటున్న మహిళలు

దారుణం..!

₹ అర్హత ఉన్నా అందని రుణమాఫీ

- ఏ గ్రామాన్ని కదిలించినా రాలేదనే రైతులే అధికం
- జాబితాల్లో పేర్లున్నా ఇంకా డబ్బులు జమ కాని వైనం
- ఆవేదనలో అన్నదాత.. కాంగ్రెస్ తీరుపై ఆగ్రహం
- సర్కారుకు వ్యతిరేకంగా ఆందోళనలకు సన్నాహాలు

'ఇచ్చింది గోరంత.. ప్రచారం కొండంత' అన్న విధంగా ఉంది రాష్ట్ర ప్రభుత్వం తీరు. కోత మీద కోతలు పెట్టి రైతుల కడుపుగొడుతున్నది. ఏ గ్రామాన్ని కదిలించినా రుణమాఫీ కాలేదని చెప్పే రైతులే అధికంగా కనిపిస్తున్నారు. కొందరికి చేసి.. మరికొందరికి కాలేదని రైతులు తీవ్ర మనోవేదన చెందుతున్నారు. అరకొరగా మాఫీగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బండబూతులు తిడుతున్నారు. మరోవైపు రైతులు ఆందోళనలకు సన్నాహాలు చేస్తున్నారు.

– యాదాద్రి భువనగిరి, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ)

భువనగిరి మండలం రామచంద్రాపురంలో రుణమాఫీ రాలేదని చెబుతున్న రైతులు

ప్రభుత్వం రుణమాఫీ అమలు విఫలమైంది. జిల్లాలో తొలి విడుతలో 36,483 మంది, రెండో విడుతలో 17,991మంది, మూడో విడుతలో 13,011మంది రైతులను లబ్ధిదారులుగా గుర్తించారు. ఇందు కోసం ప్రత్యేకంగా వేర్వేరుగా జాబితాలను విడుదల చేశారు. అర్హులైన అనేక మందికి జాబితాల్లో పేర్లు లేవు. ఇక లిస్ట్‌లో పేర్లున్నా అనేక మందికి మాఫీ కాలేదు. ఇప్పటి వరకు బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అన్ని అర్హతలు ఉన్నా మాఫీ కావడంలేదు. దీంతో రైతులు బ్యాంకులు, రైతు వేదికలు, వ్యవసాయ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఒక్కొక్కరు ఐదారు సార్లు తిరిగినా ఫలితం లేకుండా పోతున్నది. ఇందు కోసం ఏర్పాటు చేసి గ్రీవెన్స్ సెల్, హెల్ప్ డెస్క్‌లు మాత్రం తూతూమంత్రంగా పని చేస్తున్నాయి.

ఎవరిని కదిలించినా మాఫీ కాలేదనే సమాధానం..

సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు వంద శాతం రుణమాఫీ చేశామని గొప్పలు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గ్రామాల్లో రైతులను కదిలిస్తే రుణమాఫీ రాలేదని చెప్పే రైతులే అధికంగా ఉన్నారు. ఒకరిని కదిలిస్తే.. ఎవరెవరికి రాలేదో వాళ్లే మరో పదిమంది వివరాలు తెలియజేస్తున్నారంటే మాఫీ అమలు తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు.. భువనగిరి మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో 50 ఇండ్లున్నాయి. అన్నీ రైతు కుటుంబాలే. దాదాపు అందరూ రుణాలు తీసుకున్నోళ్లే. ఈ గ్రామంలో పట్టుమని పది లోపు రైతులకు మినహా ఎవరికీ మాఫీ కాలేదని గ్రామంలోని కర్షకులకే స్వయంగా చెబుతున్నారు. అదే విధంగా బాలెంపల్లి, యాదగిరిగుట్టలోని మాసాయిపేట గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.

ఆందోళనలకు రైతుల సన్నాహాలు..

రైతులు ఇప్పటికే పలు సార్లు బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరిగారు. మూడో విడుతలోనైనా తమ పేర్లు ఉంటాయని భావించారు. కానీ అందులోనూ లేకపోవడంతో ఆందోళనలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే పలు జిల్లాలో పెద్దఎత్తున ఆందోళన చేస్తున్నారు. వినతిపత్రాలు, నిరసనలు, ధర్నాలు చేసేలా సన్నాహాలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులను కలిసి సమస్యను వివరిస్తున్నారు. ఇప్పటికే కొందరు బాధిత రైతులు కలిసి వాట్సాప్ గ్రూపులను క్రియేట్ చేస్తున్నారు. మరోవైపు రైతుల ఆందోళనకు బీఆర్ఎస్ అండగా నిలువనుంది. రైతులకు మద్దతుగా ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొననుంది.

కాంగ్రెస్‌ను తిట్టిపోస్తున్న రైతులు

రుణమాఫీ కాకపోవడంపై రైతులు తీవ్ర మనోవేదన చెందుతున్నారు. అందరూ చిన్నసన్నకారు రైతులే. రుణాలు మాఫీ అవుతాయనే ఆశతో ఉన్నోళ్లు ఇప్పుడు ప్రభుత్వం చేయకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. ఇక చేసేదేం లేక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బండ బూతులు తిడుతున్నారు. గ్రామాల్లోని రచ్చబండ దగ్గర కూర్చొని తిట్టిపోస్తున్నారు. ముసలోళ్లైతే శాపనార్థాలు పెడుతున్నారు. అందరికీ చేయడం చేతకాన్నప్పుడు ఎందుకు హామీ ఇవ్వాలని, ఆశ పెట్టాలని మండిపడుతున్నారు. ఖర్మకాలి కాంగ్రెస్ పార్టీకి ఓటేశామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మళ్లోసారి ఓట్లని వస్తే తన్ని తరిమేస్తామంటూ ముక్త కంఠంతో హెచ్చరిస్తున్నారు.

అరకొర రుణమాఫీకి కొన్ని ఉదాహరణలు

- తుర్కపల్లి పీఏసీఎస్ పరిధిలో మూడో విడుతలో శనివారం సాయంత్రం వరకు 374 మంది రైతులకు 66 మందికి మాత్రమే మాఫీ అయ్యింది.
- యాదగిరిగుట్ట పీఏసీఎస్‌లో 338 మందికిగానూ 58 మందికి మాత్రమే డబ్బులు జమ అయ్యాయి.
- అడ్డగూడూరు పీఏసీఎస్‌లో 1100 మంది రైతులకు 664 మందికి మాత్రమే మాఫీ అయ్యింది. ఇంకా 436మందికి మాఫీ కావాల్సి ఉంది.
- రాజాపేట పీఏసీఎస్ పరిధిలో 512 మందికి 103 మందికి మాత్రమే రుణ మాఫీ డబ్బు జమ అయ్యాయి.
- మోత్కూరు రైతు సేవా సహకార సంఘం పరిధిలో 876 మందికి 350 మందికి మాత్రమే ఖాతాల్లో డబ్బు జమ కాగా, ఇంకా 526 మందికి కావాల్సి ఉంది.
- చౌటుప్పల్ పీఏసీఎస్ పరిధిలో 362 మంది రైతులకు 229 మంది ఖాతాల్లో డబ్బు జమయ్యాయి. ఇంకా 133 మందికి మాఫీ కావాలి.

మా కుటుంబంలో ఎవరికీ మాఫీ కాలే..

నాకు 10 ఎకరాల భూమి ఉంది. రూ. 1.50 లక్షల బ్యాంకు అప్పు ఉంది. కాంగ్రెస్ సర్కారు మాఫీ చేస్తుందటే ఎంతో సంబురం పడ్డాం. మాకు రేషన్ కార్డు కూడా ఉంది. అధికారులు ఎందుకు వస్తలేదో చెప్తలేరు. ఆఫీసర్లు రాలేదనే మాటనే చెప్తున్నరు. నా భార్యకు కూడా లక్ష అప్పు ఉంది. ఇద్దరిలో ఎవరికీ మాఫీ కాలేదు. నా కొడుకులకు కూడా రుణమాఫీ కాలేదు. ఈ ప్రభుత్వం మరి ఎవరికి మాఫీ చేస్తది. మాఫీ రాదు.. పోదు.. రేవంత్ రెడ్డి ఆశ పెట్టి జనాల్ని ఆగం చేసిండు.

– చిన్నం భూమయ్య, రైతు, రామచంద్రాపురం, భువనగిరి మండలం

ఇంతవరకూ రుణమాఫీ డబ్బులు జమ కాలేదు

మూడు విడుతల్లో ఒక్కసారైనా రుణమాఫీ అవుతుందని ఎదురు చూసిన. బ్యాంకు ఖాతాలో నగదు పడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువునా ముంచుతున్నది. అధికారంలోకి వచ్చాక రైతుల కష్టాలను పట్టించుకున్న పాపాన పోలేదు. రేవంత్‌రెడ్డి సర్కారు మాటల గారడి చేస్తున్నది. రైతుల ఉసురు తప్పక తగులుతుంది. రుణమాఫీ కోసం బ్యాంకుల చుట్టూ తిరిగే దుస్థితి దాపురించింది. కేసీఆర్ హయాంలో రైతు రాజులా ఉండే. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతును గుర్తించే నాథుడే కరువయ్యారు.

– దూడల శంకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ బాలంపల్లి, భువనగిరి మండలం



సూర్యాపేట క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ బీమా చెక్కులను అందిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

బీఆర్ఎస్ సభ్యత్వ బీమా.. కార్యకర్తలకు ధీమా

- మాజీ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలన్నీ సంచలనాత్మకాలే..
- మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి

సూర్యాపేట టౌన్, ఆగస్టు 18 : పార్టీని నమ్ముకున్న కార్యకర్తల కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నామని.. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ బీమాతో వారి కుటుంబాలకు అండగా నిలుస్తున్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం బీమా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలన్నీ సంచలనాలేనన్నారు. సుమారు 14 ఏండ్లు పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, పదేండ్ల పాలనలోనే అన్ని రంగాల అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాల్లో తెలంగాణను యావత్ దేశానికే ఆదర్శంగా నిలిపారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ప్రశాంత వాతావరణం కల్పించామని, అన్ని వర్గాల వారికి అండగా నిలిచామని చెప్పారు. ఈ సందర్భంగా సూర్యాపేట నియోజకవర్గంలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన అనసూర్య, అక్కలదేవి గూడెం గ్రామానికి చెందిన పుట్ట సుజాత, లక్ష్మి, రాయినిగూడెం గ్రామానికి చెందిన నరేశ్‌కు రూ. 2లక్షల చొప్పున పార్టీ సభ్యత్వ బీమా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, పార్టీ మండలాధ్యక్షుడు తూడి నర్సింహా రావు, నాయకులు మర్ల చంద్రారెడ్డి, జూలకంటి సుధాకర్ రెడ్డి, జూలకంటి జీవన్ రెడ్డి, గురవింద్ గౌడ్, నర్సి రెడ్డి పాల్గొన్నారు.

అగ్రి షో ముగింపులో భాగంగా మెమెంటోలు అందిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పక్కన రైతుబడి నిర్వాహకుడు రాజేందర్‌రెడ్డి

అగ్రి షో సక్సెస్

- తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి రైతులు రాక
- వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక టెక్నాలజీని వివరించిన వివిధ కంపెనీలు
- వ్యవసాయ రంగంలో వస్తున్న టెక్నాలజీని రైతాంగానికి అందించాలి
- రైతుబడి అగ్రి షో ముగింపు కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా

నీలగిరి, ఆగస్టు 18 : రైతుబడి అధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున డిగ్రీ కళాశాల అవరణలో రెండు రోజులపాటు నిర్వహించిన అగ్రి షో సక్సెస్ అయ్యింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి వివిధ కంపెనీ ప్రతినిధులు, ఏజెన్సీ నిర్వాహకులు, రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రూపొందించిన ఆధునిక యంత్రాలు, పరికరాలతో పాటు ప్రకృతిపరంగా తయారయ్యే కంపోస్టులను సుమారు వందకుపైగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో రైతులకు పరిచయం చేశారు. సుమారు 30వేల మందికిపైగా రైతులు ఈ కార్యక్రమంలో వ్యవసాయంలో కొత్త పద్ధతులు, యంత్రాల వినియోగం గురించి తెలుసుకున్నారు. ముగింపు సందర్భంగా తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొని భాగస్వాములకు మెమెంటోలు అందించారు. నిర్వాహకుడు రాజేందర్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ వ్యవసాయ రంగం దండుగ అనే నానుడి నుంచి పండుగ అని కోట్లాది మంది రైతులు దానిని ఉపాధిగా చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతికతను పెంపొందించుకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం వ్యవసాయ రంగంపైపు కదులుతున్నారని తెలిపారు. వ్యవసాయం అనేది అంతటా ఒకేలా ఉండదని, ప్రతి ఒక్కరూ కొత్త విషయాలు తెలుసుకునేందుకు ఇలాంటి అగ్రి షోలను ద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ ఖయ్యూంబేగ్, యామా కవితారాణీదయాకర్, నిర్వాహకుడు జూలకంటి రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీలు ఐక్యంగా పోరాడితేనే రాజ్యాధికారం

- సర్దార్ పాపన్న గౌడ్ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలి
- పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య
- వెలమ, రెడ్డిల మందుకు ఆశపడి బీసీలు ఓట్లు అమ్ముకుంటున్నరు : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



గుండాల మండల కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

గుండాల, ఆగస్టు 18 : బీసీలు పోరాడితేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. గుండాల మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆదివారం ఈరసరపు యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ వందల ఏండ్ల క్రితమే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సాధారణ కుటుంబంలో జన్మించి భువనగిరి, గోల్కొండ కోటలను జయించడం చరిత్రాత్మకమన్నారు. ఆయన పోరాట పటిమతో బీసీలంతా ఏకమై పోరాడితనే రాజ్యాధికారం సాధ్యమౌతుందని తెలిపారు. ప్రభుత్వం గౌడన్నల కోసం నూతన మోకులకు అందజేస్తున్నదని చెప్పారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ వారసులు రాజులు కావాలని, పాపన్న గౌడ్ గోల్కొండ కోటను జయించడానికి బహునుజలను వెంట బెట్టుకుని వెళ్తే... బహుజనులు మాత్రం రెడ్డిలను నమ్ముకుని ముందుకు వెళ్తున్నారని ఆయన అన్నారు. సభలో ఓ వ్యక్తి లేచి అందుకే రెడ్డిలు ఎవరూ ఈ సభకు రాలేదని అనగా...పలువురు సభకు వచ్చిన వ్యక్తులు అలా అనొద్దని ఆ వ్యక్తిని వారించారు. దాంతో తీన్మార్ మల్లన్న బదులు ఇస్తూ ఆ వ్యక్తి చెప్పిన మాటలు తప్పు పట్టొద్దని, ఈ సభకు వారు నిజంగానే రావొద్దని అన్నారు. గౌడ్‌లు అడుక్కునే వారు కాదని ఒకప్పుడు ఈ దేశాన్ని ఏలిన వారని తెలిపారు. వెలమలు, రెడ్డిలు ఇచ్చే మందుకు ఆశపడి బీసీలు ఓటును అమ్ముకుంటున్నారని, అదే బీసీలు వెలమ, రెడ్డి ఓట్లను మందుకు కొనగలరా అని ప్రశ్నించారు. మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ నాడు పాపన్న గౌడ్ దొరలు, మొగలులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప పోరాట యోధుడని అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒకే ఒక్క బీసీ ఎమ్మెల్యే అయిలయ్య ఉన్నాడని, ఆయన మంత్రి పదవికి అర్హుడే అని, అందుకు తాను రాహుల్ గాంధీకి లేఖ రాస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ గడ్డమీది పాండరిగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ లింగాల భిక్షం గౌడ్, నాయకులు ఏలూరి రాంరెడ్డి, కవి, గాయకులు కోదారి శ్రీనివాస్, లగ్గాని రమేశ్‌గౌడ్, నూనెముంతల వెంకటేశ్వర్లు, బీసు చందర్‌గౌడ్, ఇమ్మడి దశరథగుప్త, పొన్నగాని నారాయణ గౌడ్, సూదగాని రామచంద్రయ్య గౌడ్, గిరికత్తుల శ్రీనివాస్‌గౌడ్, పొడిశెట్టి వెంకన్నగౌడ్, దంతూరి మల్లయ్యగౌడ్, మహేశ్‌గౌడ్, గడ్డం దశరథగౌడ్, బత్తిని మహేశ్‌గౌడ్, సింగారం నర్సింహ పాల్గొన్నారు.

సుంకిశాల ఘటనపై విజిలెన్స్ విచారణ

- సంఘటన ప్రదేశాన్ని సందర్శించిన అధికారులు

పెద్దవూర ఆగస్టు 18 : నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం సుంకిశాల ప్రాజెక్టులో రిటైనింగ్ వాల్ కూలిన ఘటనపై విచారణ చేపట్టేందుకు ఆదివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఘటనకు గల కారణాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఇంత ప్రమాదం జరిగినా తమ దృష్టికి రాలేదని, సోషల్ మీడియా, మీడియా చానెల్ ద్వారానే వివరాలు తెలుసుకున్నామని వారు అక్కడి అధికారులతో తెలిపారు. ఈ నష్టం ఎంత మొత్తంలో ఉంది దీనికి కారణం ఎవరనే విషయల పై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంఘటన ఈ నెల 2న జరిగినా తమకు ఈ మధ్యనే తెలిసిందని, దీనిపై పూర్తి దర్యాప్తు చేసిన తర్వాత తదుపరి వివరాలు వెల్లడిస్తామన్నారు. సందర్శించిన వారిలో అడిషనల్ ఎస్పీ ఆనంద్‌కుమార్, డిప్యూటీ ఇంజినీరింగ్ బాలకృష్ణ , ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నల్లగొండలో రైతుబడి అగ్రి షోను సందర్శిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత చాడ కిషన్‌రెడ్డి, రైతులు

ఆధునిక పద్ధతులు వచ్చాకే వృత్తుల్లో మార్పులు

- వ్యవసాయ శాఖ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ఆధునిక పద్ధతులు వచ్చాకే వృత్తుల్లో మార్పులు వచ్చాయని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. నల్లగొండలో రైతుబడి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన అగ్రి షోను ఆయన సందర్శించారు. సుమారు రెండు గంటలపాటు స్టాళ్లను తిరిగి వ్యవసాయ ఉత్పత్తులు, సాంకేతిక పరికరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అగ్రిషోలను విశ్వవిద్యాలయాలు చేయాలని, అందుకు ప్రభుత్వం సహకారం అందించాలని అన్నారు. మార్పులకు అనుగుణంగా సాంకేతికను వినియోగిస్తూ కొత్తపంథాను అనుసరించాలని రైతాంగానికి సూచించారు. రాష్ట్రంలో మాంసం ఉత్పత్తికి చాలా డిమాండ్ పెరిగిందని, ఇలాంటి లాభదాయకమైన వాటిపై దృష్టి సారించాలన్నారు. దేశంలో రైతులకు ఇది ఇచ్చాం, అది ఇచ్చాం అనే గొప్పలు చెప్పకుండా వ్యవసాయం రంగాన్ని పరిశ్రమగా తీసుకున్న ప్రభుత్వాలే భవిష్యత్‌లో ప్రజాదరణ పొందుతాయని చెప్పారు. అందరూ లాభాల కోసమే పనిచేస్తుంటారు కానీ అంతిమంగా తినడానికి తిండి అవసరమని, వెయ్యి రూపాయలు పెట్టి కొత్తిమీర, పదివేలు పెట్టి అలుగడ్డలు, ఉల్లిగడ్డలు కొనే దుస్థితి రావద్దని అన్నారు. ఎవరు ఎన్ని లక్షలు సంపాదించినా సక్రమంగా పంటలు పండించకపోతే, గిట్టుబాటు ధర రాకపోతే రైతులు ఆ రంగాన్ని వదలేసే పరిస్థితి ఉంటుందని, మానవ మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని చెప్పారు. అగ్రిషోను నల్లగొండలోనే కాకుండా తెలంగాణ వ్యాప్తంగా పెట్టాలని సూచించారు.

రెండు గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

- డ్యామ్‌ను చూసేందుకు పెద్ద సంఖ్యలో పర్యాటకుల రాక

నాగార్జునసాగర్ డ్యామ్ రెండు క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నందికొండ, ఆగస్టు 18 : శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో కొనసాతుండడంతో నాగార్జునసాగర్ డ్యామ్ 2 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల చేస్తున్నారు. డ్యామ్ పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులకు పూర్తి స్థాయిలో నీరు నిల్వ ఉంది. రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 24,920, ఎడమ కాల్వ ద్వారా 6,791, కుడి కాల్వ ద్వారా 8,067, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,151, వరద కాల్వ ద్వారా 600, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. శ్రీశైలం నుంచి 71,329 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో సాగర్‌కు అంతే మొత్తంలో అవుట్‌ఫ్లోను కొనసాగిస్తున్నారు. తెలంగాణ టూరిజం కృష్ణా నదిలో ఏర్పాటు చేసిన లాంచీలో నాగార్జున కొండకు, జాలీ ట్రిప్పులకు వెళ్లేందుకు పర్యాటకులు ఆసక్తి కనపరిచారు. నల్లమల అడవుల మధ్య లాంచీ ప్రయాణం బాగుందని పర్యాటకులు తెలిపారు. నదీ తీరంలో పర్యాటకులు సెల్ఫీలు దిగుతూ, లాంచీస్టేషన్ పరిసరాల్లో భోజనాలు చేస్తూ సరదాగా గడిపారు. సాగర్ డ్యామ్, లాంచీ స్టేషన్, బుద్ధవనం పరిసరాలు జనంతో కిటకిటలాడాయి.

లాంచీలో నాగార్జునకొండకు వెళ్లి వస్తున్న పర్యాటకులు

సాగర్ నీటిని వృథా చేయకుండా చెరువులు నింపాలి : మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

నార్కట్‌పల్లి, ఆగస్టు 18 : నాగార్జున సాగర్ నీటిని వృథాగా గేట్ల ద్వారా వదలకుండా జిల్లాలోని అన్ని చెరువులు నింపాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రభుత్వానికి సూచించారు. నార్కట్‌పల్లిలోని తన నివాసంలో ఆదివారం విలేకరు సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల రెండు నుంచి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు భారీగా వరద నీరు వస్తుండగా అధికారులు గేట్ల ద్వారా దిగువకు వదిలి నీటిని వృథా చేస్తున్నారని అన్నారు. ఈ విషయంపై తాము ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోకుండా అదే తరహాలోనే నీటిని వృథా చేస్తున్నారని తెలిపారు. సాగర్‌కు వచ్చిన నీటితో నల్లగొండ జిల్లాలోని అన్ని చెరువులను కాల్వల ద్వారా నింపి కరువును నుంచి విముక్తి చేయాలని, రైతులను ఆదుకోవాలని కోరారు. సాగర్ ప్రాజెక్టు నుంచి ఖమ్మం నీటిని తీసుకుపోవడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, మంత్రులకు సాధ్యమవుతుందని కానీ జిల్లాలో ఉన్నటువంటి ప్రాజెక్టులు, చెరువులను మాత్రం నింపి రైతులకు నీటి కష్టాలు లేకుండా చేయాలనే అలోచన ఆ పార్టీ నాయకులకు లేదన్నారు.